www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 8 జనవరి 2025
5
పశ్చిమ గోదావరి



ఢిల్లీ నుంచి సుబ్బారావుకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటకు చెందిన ఉత్తమ రైతు, అనేక అవార్డులు పొందిన నెక్కంటి సుబ్బారావును రిపబ్లిక్ డే వేడుకలకు ఢిల్లీ రావాలని మంగళవారం ఆహ్వానం అందింది. ఈ నెల 26న ఢిల్లీలో జరుగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆహ్వాన పత్రిక అందుకున్న వారిలో నెక్కంటి సుబ్బారావు ఒకరు. ఈయన హైబ్రిడ్ కొత్త వరి వంగడాలను తీసుకొచ్చి రైతులు అధిక దిగుబడులు సాధించేలా కృషి చేస్తారు.



ఆహ్వాన పత్రిక అందుకుంటున్న నెక్కంటి సుబ్బారావు

జెడ్‌పి తీర్మానాలు.. ఆమోదం పొందేనా..!

నేడు జెడ్‌పి స్టాండింగ్ కమిటీ సమావేశాలు
కోరం లేక గతేడాది నవంబర్ 8న సమావేశాలు రద్దు
డిసెంబర్ 21న జెడ్‌పి ప్రత్యేక సమావేశంలోనూ ఛైర్‌పర్సన్‌పై వైసిపి సభ్యుల తిరుగుబాటు
స్టాండింగ్ కమిటీలో తీర్మానాలను వ్యతిరేకించేందుకు వ్యూహం
తీర్మానాలు ఆమోదం పొందకపోతే జెడ్‌పి పనులకు విఘాతమే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలపై ఉత్కంఠ నెలకొంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీపై తిరుగుబాటు ధోరణిలో వైసిపి సభ్యులు ఉండటంతో బుధవారం జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశాలు సవ్యంగా సాగుతాయా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఒకవేళ సమావేశానికి హాజరైనా తీర్మానాలను వ్యతిరేకించే ఆలోచనలో వైసిపి సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జిల్లా పరిషత్ అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం ఏర్పడనుంది. జిల్లా పరిషత్‌లో మొత్తం ఏడు స్టాండింగ్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో కమిటీలో తొమ్మిది మంది, కొన్ని కమిటీల్లో 12 మంది సభ్యులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంఎల్‌ఎలు, ఎంపీలు సైతం స్టాండింగ్ కమిటీల్లో సభ్యులుగా ఉంటారు. నిబంధనల ప్రకారం 60 పని దినాల్లో స్టాండింగ్ కమిటీ సమావేశాలు, 90 పనిదినాల ఆధారంగా జెడ్‌పి సర్వసభ్య సమావేశం జరపాల్సి ఉంటుంది. 2024 నవంబర్ ఎనిమిదో తేదీన జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు కోరం లేక రద్దయ్యాయి. దీంతో అనేక బిల్లులకు సంబంధించిన తీర్మానాలు ఆమోదం పొందని పరిస్థితి నెలకొంది. 60 రోజులు పూర్తవ్వడంతో మరోసారి స్టాండింగ్ కమిటీ సమావేశాలు బుధవారం నిర్వహించేందుకు జిల్లా పరిషత్ సిఇఒ నోటిఫికేషన్ విడుదల చేశారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరగాలంటే ప్రతి కమిటీకి కోరం ఉండాలి. 12 మంది సభ్యుల్లో కనీసంగా నలుగురు, తొమ్మిది మంది సభ్యులు ఉంటే ముగ్గురు హాజరైతేనే కోరం ఏర్పడి సమావేశాలు జరుగుతాయి. జిల్లా పరిషత్ నిధుల ఖర్చులకు సంబంధించిన బిల్లులు ఏవైనా స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందాలి. కరెంటు బిల్లులకుసైతం ఆమోదం తెలిపితేనే ఖర్చు చేసేందుకు వీలుంటుంది. అంతేకాకుండా ఈ సమావేశాలకు జిల్లా అధికారులంతా హాజరవుతారు. ఆయా శాఖలవారీగా జరగబోయే అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలు చేయాల్సి ఉంటుంది. వైసిపి సభ్యులు స్టాండింగ్ కమిటీ సమావేశాలకు హాజరవుతారా అనే అనుమానాలు నెలకొన్నాయి. సమావేశాలకు హాజరైనా తీర్మానాలను వ్యతిరేకించాలనే ఆలోచనలో వైసిపి సభ్యులు ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మరోసారి రాజకీయ రగడ పెరిగే అవకాశం ఉంటుంది. తీర్మానాలు ఆమోదం పొందకపోతే పరిస్థితి తీవ్రరూపం దాల్చే పరిస్థితి ఏర్పడనుంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ టిడిపిలో చేరడమే అనే చర్చ సాగుతోంది.



జిల్లా పరిషత్ కార్యాలయం

జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీపై వైసిపి సభ్యులు గుర్రు..

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకోవడంపై జిల్లా పరిషత్‌లో రాజకీయ గలాట మొదలైంది. జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ టిడిపిలోకి వెళ్లడాన్ని వైసిపి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్‌లో 48 మంది జెడ్‌పిటిసిలకుగాను 46 మంది వైసిపి సభ్యులే ఉన్నారు. యలమంచిలి జెడ్‌పిటిసి కవురు శ్రీనివాస్ ఎంఎల్‌సిగా ఎన్నికవడంతో ప్రస్తుతం 45 మంది వైసిపి జెడ్‌పిటిసిలు ఉన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్‌ను పదవి నుంచి తప్పించాలని వైసిపి సభ్యులు పట్టుబట్టి జెడ్‌పి సిఇఒ, జిల్లా కలెక్టర్‌కు సైతం వైసిపి సభ్యులు వినతిపత్రాలు అందించారు. అనేక ఘర్షణల అనంతరం ఎట్టకేలకు 2024 డిసెంబర్ 21న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 38 మంది జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ తీరును అంతా తప్పుబట్టిన పరిస్థితి ఉంది. అయితే చట్టప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టడానికిగాని, అనర్హత వేటుకుగాని అవకాశాలు లేవని జిల్లా పరిషత్ సభ్యులకు తెలియపర్చి సిఇఒ సమావేశం ముగించారు. అయితే అదే రోజు మధ్యాహ్నం నుంచి జరిగిన జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో వైసిపి సభ్యులు చాలామంది పాల్గొనలేదు. కోరం లేక గంటపాటు సమావేశం నిలిచిపోయింది. ఎట్టకేలకు 17 మంది సభ్యులు సంతకాలు చేయడంతో కోరం పూర్తయ్యి సమావేశం సాగింది. సంతకాలు చేసిన వారిలో 15 మంది వైసిపి సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వైసిపి సభ్యులు హాజరైనా తీర్మానాలను వ్యతిరేకించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జెడ్‌పి రాజకీయం మరింత వేడెక్కనుంది. వైసిపి సభ్యులు జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కు అనుకూలంగా ముందుకు సాగితే మాత్రం అంతా సాఫీగా సాగిపోనుంది.



జిల్లా సహకారి అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నేతలు కోపరేటివ్ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

డిమాండ్లతో కూడిన సమ్మె పత్రాలను అధికారులకు అందించిన కోఆపరేటివ్ ఉద్యోగులు
సొసైటీల ప్రయివేటీకరణ యత్నాలను విరమించుకోవాలి
కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు విజయభాస్కర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

వ్యవసాయ కోఆపరేటివ్ సొసైటీ ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోఆపరేటివ్ ఉద్యోగుల సంఘం నేతలు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. కంప్యూటరీకరణ పేరుతో ఎటువంటి శిక్షణా ఇవ్వకుండా ఉద్యోగులను ఒత్తిడికి గురి చేయడం సరైంది కాదన్నారు. గతంలో ఇచ్చిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళన చేయడంతోపాటు ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సిద్ధంగా ఉన్నామని జిల్లా సహకార అధికారి, జిల్లా రెవెన్యూ అధికారికి డిమాండ్లతో కూడిన సమ్మె పత్రాలను స్థానిక కలెక్టరేట్లో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగిన ఉద్యోగుల సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు పి.విజయభాస్కర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడారు. వ్యవసాయ పరపతి సొసైటీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరించాలనే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2014 నుండి ఉద్యోగులకు వేతన సవరణ చేయలేదని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా, ఉద్యోగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం సాచివేత వైఖరిని ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న డిసిసిబి ఎదుట, 20న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాలకు రాష్ట్ర సంఘం పిలుపునిచ్చిందని, ఉద్యోగులందరూ పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల సొసైటీల్లో కంప్యూటరీకరణ పేరుతో ఎటువంటి సౌకర్యాలూ కల్పించకుండా, శిక్షణ ఇవ్వకుండా గత ఆరు నెలల నుండి తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్ పనుల పేరుతో ఉద్యోగులపై పని భారాన్ని పెంచారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కృష్ణప్రసాద్, కోశాధికారి ఇ.పెద్దిరాజు, కన్వీనర్ పి.నరసింహరాజు మాట్లాడుతూ కోఆపరేటివ్ సొసైటీలను బలోపేతం చేయాలన్నారు. రైతాంగానికి మరింత సేవ చేసేలా ప్రభుత్వ విధానాలు ఉండాలన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే సమ్మెకు ఉద్యోగులందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కృష్ణంరాజు, జిల్లా నాయకులు ఎన్.ఏసుబాబు, రామకృష్ణ సుబ్రహ్మణ్యం, గణపతి, ఎం.శ్రీను, కెఎస్.ప్రభు, జి.శ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనాలే లక్ష్యం

జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి డాక్టర్ జితేంద్రసింగ్

ప్రజాశక్తి - పెనుమంట్ర, ఆచంట

సన్న, చిన్నకారు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జలశక్తి అభియాన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర అగ్రికల్చర్ ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టర్, జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి డాక్టర్ జితేంద్రసింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జలశక్తి అభియాన్ సెంట్రల్ టీమ్ రెండో రోజు పర్యటనలో భాగంగా జెఎఎస్ నోడల్ అధికారి డాక్టర్ జితేంద్రసింగ్‌తోపాటు సైంటిస్ట్ మౌనికసింగ్, డ్వామా పీడీ డాక్టర్ సిహెచ్.అప్పారావు, ఇతర అధికారులు పెనుమంట్ర మండలం పొలమూరు, ఆచంట మండలం భీమలాపురం గ్రామాల్లో పర్యటించారు. జెఎఎస్ కింద చేపట్టిన వివిధ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో తొలుత పొలమూరు పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా చిన్న, సన్నకారు రైతుల భూముల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మామిడి, మునగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడి కొన్ని విషయాలపై చర్చించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి వాటర్ స్కీమ్‌ను పరిశీలించారు.



నరసాపురం : మామిడి తోటలు పరిశీలిస్తున్న కేంద్రం బృందం

ఆచంట మండలం భీమలాపురం గ్రామ పంచాయతీ పరిధిలో హార్టికల్చర్‌లో భాగంగా పది మంది చిన్న, సన్నకారు రైతులకు చెందిన 20 ఎకరాల్లో చేపట్టిన తైవాన్ జామ పంటకు సంబంధించి పనులను పరిశీలించారు. అనంతరం పంట సాగు చేస్తున్న 20 మంది రైతులతో ముఖాముఖి మాట్లాడి జెఎఎస్ పథకం ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి వివిధ పనులను పరిశీలించి తాగునీటిని కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపిడిఒ శర్మ, ఎపిఒ బాపూజి, ఆచంట ఎంపిడిఒ టి.బాబ్జి, ఎపిఒ సుదర్శన్, సిఒ పోసి, జిల్లా అంబుడ్స్‌మెన్ ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ కె.దానానంద్, ఎఇ సాయిప్రకాష్, తణుకు క్లస్టర్ ప్రసాద్, పంచాయతీ సెక్రటరీలు, భీమలాపురం సర్పంచి గుబ్బల మాధవరావు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నరసాపురం: సీతారాంపురం సౌత్ గ్రామంలోఉపాధి హామీ కింద సాగు చేస్తున్న మామిడి మొక్కల పెంపకం, ఉద్యాన సాగును కేంద్ర జలశక్తి అభియాన్ చీఫ్ నోడల్ అధికారి జితేంద్ర సింగ్, ఉద్యాన శాస్త్రవేత్త మౌనిక సింగ్ మంగళవారం పరిశీలించారు. రైతులను సాగు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని రక్షిత మంచినీటి సరఫరా తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు, ఉపాధి హామీ ఎపిఒ వై.శ్రీనివాస్, గ్రామ సర్పంచి దొండపాటి వెంకట్, గ్రామ కార్యదర్శి ఎంవై.శ్రీనివాస్, రైతులు జంపన గణపతిరాజు, పి.వెంకటేశ్వరరావు, ఎం.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డయాలిసిస్ కేంద్రం పనుల్లో జాప్యంపై..

మంత్రి నిమ్మల ఆగ్రహం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పనులను మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో జాప్యంపై సంబంధిత ఏజెన్సీ ప్రతినిధులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత జగన్ ప్రభుత్వ హయాంలోని నిర్లక్ష్యాన్ని వీడి పనులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల్లో నాణ్యతా లోపాలను సరిదిద్దకపోతే సంబంధిత అధికారులు, ఏజెన్సీపై చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తూ పెద్ద ఎత్తున సిఎం సహాయ నిధిని అందిస్తుందని చెప్పారు.



ఆసుపత్రిలో డయాలిసిస్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి నిమ్మల

కోడిపందేలు వేస్తే కఠిన చర్యలు

కలెక్టర్ సి.నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పశువుల సంరక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా జంతు సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. జంతువుల పట్ల దయ, కారుణ్యం కలిగి ఉండాలన్నారు. మూగ జీవాలను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జంతు సంరక్షణ సామాజిక బాధ్యత అన్నారు. సంక్రాంతి పండుగ పేరు చెప్పుకుని కోడి పందేలు నిర్వహించటం చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా ఎఎస్‌పి వి.భీమారావు మాట్లాడుతూ కోడి పందేలు, బరులు నిర్వహించకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలుకు సూచించామని, దీనిపై మైక్ ప్రచారం కూడా చేపట్టనున్నామని వివరించారు. అనంతరం కోడిపందేల నిషేధంపై వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, జిల్లా జంతు సంక్షేమ సంఘం అధికార, అనధికార సభ్యులు పాల్గొన్నారు.



కోడిపందాల నిషేధంపై వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ నాగరాణి

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరం మండలం బేతపూడిలో కమ్యూనిటీ హాలు వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుండి స్వీకరించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలోని మంచినీటి చెరువు కలుషితమై పోయినదని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై అనంతరం క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తాగునీరు కలుషితానికి కారణాలను ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రావి రాంబాబు, మండల సర్వేయర్ జి.నాగబాబు, అధికారులు, ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి



నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

పుంత రోడ్ల అభివృద్ధి కోరుతూ సిపిఎం నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

పుంత రోడ్లను అభివృద్ధి చేయాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కెపిపాలెం నార్త్ పంచాయతీ పరిధిలోని పంట కాలవ గట్లు గల పుంత రోడ్లను, మెట్టిరేవు నుండి పావురాల వారి మెరక వరకు గల పంట కాలువ పక్క గల రోడ్లను నిర్మించాలని సిపిఎం నాయకులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత యడ్ల చిట్టిబాబు మాట్లాడుతూ కొంతకాలంగా పంట కాలవ పక్కన రోడ్ల నిర్మాణం చేపట్టలేదన్నారు. దీంతో ఆ రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాలువ గట్లు, లింకు రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ కార్యాలయ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొత్తపల్లి నాగరాజు, ముచ్చల రాజారావు, కొల్లాటి బాబూరావు పాల్గొన్నారు.

వాన్‌బర్రి సిబ్బందికి వేతన ఒప్పందం

ప్రజాశక్తి - తణుకు

వాన్‌బర్రి యాజమాన్యం, కార్మికుల మధ్య వేతన ఒప్పందం కుదిరిందని వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, యూనియన్ ప్రధాన కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఏలూరులోని జెసిఎల్ కార్యాలయంలో జెసిఎల్ సమక్షంలో ఇరువురు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ అగ్రిమెంట్ 2024 ఏప్రిల్ 1వ తేదీ నుండి 2026 మార్చి వరకు రెండు సంవత్సరాలు అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి కార్మికులకు మాత్రమే అగ్రిమెంట్ జరుగుతుందని, ఈసారి స్టాఫ్ అండ్ వర్కర్స్‌కు కూడా ఒప్పందం విజయవంతమైందని తెలిపారు. దీనికి సహకరించిన యాజమాన్య ప్రతినిధులు డైరెక్టర్ జి.బాలప్రభాకర్, జిఎం ఎంవిఎస్ఎస్ఎన్.మూర్తి, హెచ్‌ఆర్‌డి జిఎం టి.వెంకటేశ్వరరావులకు యూనియన్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గుబ్బల గోపీ, వైటి.రామకృష్ణ, హర్షవర్ధన్, జయకృష్ణ, కేతా శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, జె.శ్రీనివాస్‌రాజు, సిఐటియు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వాన్‌బరి యాజమాన్యం, కార్మికుల మధ్య వేతన ఒప్పందం కుదుర్చుకున్న వైనం

సమస్యలు పరిష్కరించాలి

పిహెచ్‌సి వద్ద ఆశాల నిరసన

నరసాపురం: ఆశా వర్కర్స్ సమస్యలపై కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు యూనియన్ నాయకులతో జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జిఒలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం తూర్పుతాళ్లు పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 11 నెలలు కావస్తున్నా జిఒలు విడుదల కాకపోవడంతో ఆశా వర్కర్స్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. 60 నుంచి 62 సంవత్సరాల వయస్సు పెంపుదల జిఒ రాకపోవడంతో ఆశావర్కర్లు తీవ్ర ఆందోళనకు గురతున్నారన్నారు. రిటైర్డ్ అయిన ఆశాలకు బెనిఫిట్ కూడా అందలేదన్నారు. అనేకమంది ఆశావర్కర్లు ఈ కాలంలో మరణించారని, వారికి బీమా సౌకర్యం కూడా వర్తించలేదని తెలిపారు. ప్రభుత్వం తక్షణం సమస్యల పరిష్కారానికి ఒప్పంద జిఒలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వం రికార్డులు అందించి, కార్మిక చట్టాలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆదిలక్ష్మి, ఎ.సత్యవతి, పి.శ్రీదేవి, డి.దయశీల, టి.లక్ష్మిప్రసన్న, జి.బాబి, సిహెచ్.సూర్యరేఖ పాల్గొన్నారు.

పందెం కోడి @ రూ.50 వేలు

ప్రజాశక్తి - కాళ్ల

గోదావరి జిల్లాల్లో సంక్రాంతి అనగానే గుర్తొచ్చేది కోడి పందేలు. ఈ నేపథ్యంలో పందెంరాయుళ్ల గ్రామాల్లో తిరుగుతూ మేలైన పుంజులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామాల్లో పందెం పుంజులకు చెరువుల వద్ద ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేసి పెంచుతున్నారు. ఒక్కో పుంజు ధర రూ.50 వేలు పలుకుతోంది. పందెం కోళ్లకు డిమాండ్ ఉండడంతో పెంపకందారులు వాటిని ఎక్కువగానే పెంచుతున్నారు. వాటికి తర్ఫీదు ఇచ్చేవారిని ఏర్పాటు చేసి సంక్రాంతి బరిలోకి దించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో కోడి పెంపకానికి సుమారు 12 నెలలుపైనే పడుతుందని, రూ.25 వేలకుపైనే ఖర్చవుతుందని చెబుతున్నారు. మండలంలోని ఏలూరుపాడు, కాళ్లకూరు, కాళ్ల, సీసలి, జక్కరం, మాలవానితిప్ప, పెదఅమిరం తదితర ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా కోడి పందేలు నిర్వహించడం పరిపాటి. ఆ క్రమంలో కొందరు కొన్ని నెలలకు ముందే ఏలూరు, భీమవరం జిల్లాల నుంచి తక్కువ ధరకు మేలైన పుంజులను కొనుగోలు చేసి పందేలకు సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. డేగ, కాకి డేగ, కొక్కిరాయి, అబ్రాస్, తెలుపు, నలుపు నెమళ్ల తదితర పేర్లతో పిలిచే కోళ్లకు గిరాకీ ఎక్కువగా ఉంది.



చెరువుల వద్ద పెంచుతున్న పుంజులు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. కాళ్లకూరు గ్రామం వెంకటాపురానికి చెందిన లంక గౌరినాయుడు (70) ఇటీవల మృతి చెందారు. లంక గౌరినాయుడు కుటుంబాన్ని దాట్ల వెంకట రామరాజు పరామర్శించారు. శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ నుంచి ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం మంగళవారం అందజేశారు. కొత్తకాలనీలో సిబిసిఎన్‌సి చర్చిలో భోజనాలకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకటరామరాజు ముందుకొచ్చి కిరాణా సామగ్రి, భోజనం ప్లేట్లు, గ్లాసు నిమిత్తం రూ.26,200 ట్రస్ట్ ద్వారా అందజేశారు. వెయ్యి లీటర్ల వాటర్ అందజేశారు. ఈ సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు మాట్లాడుతూ కాళ్లకూరులో పేద, బడుగు, బలహీనవర్గాల వారికి చేతనైన సహాయం అందిస్తున్నామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చని మిలిటరీ సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు సూచించారు. మంగళవారం పట్టణ ఆరోగ్య కేంద్రాలు యాగర్లపల్లి, కడకట్ల, ఎన్‌టిఆర్ జంక్షన్ వేర్‌హౌస్ కాలనీల్లో ఆశాడే కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ అవగాహనా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.రవికుమార్, తనూజ, శ్రావ్య, ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయారు, పద్మ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఈనెల 4వ తేదీన గేమ్ చేంజర్ ఈవెంట్ అనంతరం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారికి కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకా రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో యండమూరి నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడకా రాజు హాజరై మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన రాజమండ్రిలో జరిగిన గేమ్ చేంజర్ ఈవెంట్‌కు కాకినాడకు చెందిన పొలుపూరి మణికంఠ, తోకడ చరణ్ ఇద్దరు హాజరై తిరుగు ప్రయాణంలో రంగంపేట వద్ద వ్యాన్ బలంగా ఢీకొట్టడంతో వారు మృతి చెందారని తెలిపారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ రెండు కుటుంబాలను పరామర్శించి ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం, గేమ్ చేంజర్ నిర్వాహకులు ఆ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బట్టపల్లి సత్యనారాయణ, అద్దాల వెంకటేశ్వరరావు, కొడమంచిలి వాసు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

9న పెంటపాడు డిగ్రీ కాలేజీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో పెంటపాడు డిఆర్‌జి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ వద్ద ఈ నెల 9వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో టీంలీజ్, ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందని, 18 నుంచి 30 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ లింక్ ద్వారా naipunyam.ap.gov.in రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు ప్రసన్న 7013896277 నంబరును సంప్రదించాలని కోరారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గణపవరం

సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు జూద క్రీడలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ వైవి.అప్పారావు, ఎఎస్ఐ చింతకాయల సత్యనారాయణ అన్నారు. మంగళవారం సరిపల్లి పంచాయతీ వద్ద స్థానికులకు కోడిపందేల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. పండుగల వల్ల కుటుంబాలు నష్టపోకుండా మంచి వాతావరణంలో జరుపుకోవాలన్నారు. పండుగ సందర్భాల్లో పేకాట, కోడిపందేలు, జూదం వంటి క్రీడల వల్ల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చనుమూరి లక్ష్మిభవాని, మండల పరిషత్ ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆచంట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని కోడి పందేలు, జూదం, గుండాట ఆడినా, అక్రమంగా మద్యం అమ్మినా కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ జి.కనకరాజు హెచ్చరించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్లకు ఇరువైపులా చెత్త తొలగింపు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నుంచి పిప్పర వెళ్లే రహదారికి ఇరు వైపులా ఉన్న చెత్తాచెదారాలను, పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమం గణపవరం పంచాయతీ అధికారులు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా గణపవరం పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు చెప్పారు. రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను జెసిపి ద్వారా పూర్తిగా తొలగిస్తున్నట్లు తెలిపారు. చెత్త తొలగింపు గణపవరం నుంచి పిప్పర వరకూ జరుగుతుందని తెలిపారు. సరిపల్లి గ్రామ శివారు వరకూ చెత్తా చెదారాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారిశుధ్యం క్షీణించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురానికి చెందిన ఉన్నత, ప్రాథమిక, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు మంగళవారం నూతన సంవత్సర యుటిఎఫ్ క్యాలెండర్లు, సిఎల్ ఫామ్స్, వాల్ స్టిక్కర్స్, గోల్డెన్ జూబ్లీ కీ చైన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్‌కె.రాజు, వైబి.శ్రీనివాసు, కె.మాణిక్యాలరావు, ఎన్‌వి.కుమార్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బెల్ట్‌షాప్ నిర్వాహకుడు అరెస్ట్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఇ.స్వరాజ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి మండలంలోని కొమ్ముగూడెంలో దాడులు నిర్వహించి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుండి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

యువతి మృతి కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - నరసాపురం

ఈ నెల 4వ తేదీన మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామం ప్రగతి నగర్‌కు చెందిన టంకాని సాయి లక్ష్మీకుమారి(19) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడు కవురు గీతా చరణ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ టి.వెంకట సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యువతి ఆత్మహత్య కేసులో మృతురాలు తండ్రి సింహాచలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కెవి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. అనంతరం రూరల్ ఎస్ఐ సురేష్, సిబ్బంది రెండు బృందాలుగా విడిపోయి గాలించగా యర్రంశెట్టి వారి పాలెం పీతాని మెరక వద్ద చరణ్ ఇంటి వద్ద అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం అతనిని నరసాపురం కోర్టులో హాజరు పరిచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిట్ ప్రొఫెసర్ రమణారావు జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు జీవన సాఫల్య పురస్కారాన్ని (లైఫ్ టైమ్ అచ్చీవ్‌మెంట్ అవార్డు) అందుకున్నారు. ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసిఐ) హైదరాబాద్ సెంటర్ నిర్వాహకులు సివిల్ ఇంజినీరింగ్ రంగంలో విశేష సేవలందించిన వారిని ఏటా గుర్తించి వారిని అవార్డులతో సత్కరించడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా 2024 సంవత్సరానికి గాను సివిల్ ఇంజినీరింగ్ రంగంలో విశిష్ట సేవలందించిన ఆచార్యులు రమణారావును అవార్డుకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఐసిఐ హైదరాబాద్ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతులమీదుగా రమణారావు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు గ్రహీత రమణారావుకు నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, డీన్‌లు డాక్టర్ జిఆర్‌కె శాస్త్రి, వి.సందీప్, ఎన్.జయరామ్, హిమబిందు, పలువురు విభాగాధిపతులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రొఫెసర్ రమణారావు

ఐ.భీమవరం, చెరుకుమిల్లిలో పింఛన్ల సర్వే

ప్రజాశక్తి - ఆకివీడు

సామాజిక పింఛన్లపై ప్రభుత్వం సర్వే ప్రారంభించింది. ఈ క్రమంలో ముందుగా వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చే రూ.15 వేల పింఛన్లపై అధికారులు సర్వే ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంగళవారం వైద్య బృందంతోపాటు, గ్రామీణ అభివృద్ధి శాఖ పంచాయతీరాజ్ శాఖ, వెలుగు తదితర శాఖల అధికారులు డిఆర్‌డిఎ పీడీ టి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఐ.భీమవరం, చెరుకుమిల్లి గ్రామాల్లో సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా డిఆర్‌డిఎ పీడీ టి.మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,510 మంది రూ.15 వేల రూపాయల చొప్పున సామాజిక పింఛను పొందుతున్నారని చెప్పారు. ఈ రకమైన పింఛనుదారులు మండలంలో 41 మంది ఉన్నారని, నగర పంచాయతీ పరిధిలో మరో 17 మంది ఉన్నారని చెప్పారు. ఈ మొత్తం సభ్యులను పింఛనుదారులు, అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి పరిశీలిస్తున్నారన్నారు. ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకూ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బృందంలో ఎముకల స్పెషలిస్ట్, నరసాపురం ప్రభుత్వాసుపత్రి డాక్టర్ జి.రవికుమార్, డాక్టర్ డి.సుభాష్ ఎండి, ఆకివీడు మండలం ప్రాథమిక వైద్యశాల డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు

నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలన్నారు. అప్పుడే నూరు శాతం ఉత్తీర్ణత సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూర్తి, రామలక్ష్మి, రామకృష్ణ, ఏసు కృపా, జయరాజు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - నరసాపురం

గోగులమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుండి 18వ తేదీ వరకూ రుస్తుంబాదలో జరిగే జాతీయ స్థాయి స్త్రీ, పురుష కబడ్డీ పోటీలకు ఉత్సవ కమిటీ ఆహ్వానాలు అందిస్తోంది. మంగళవారం టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజా రామ్మోహన్ నాయుడును ఆయన నివాసంలో ఉత్సవ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చినమిల్లి ముమ్ము, రేఖపల్లి సురేష్, యాదంరెడ్డి మహేష్, కొప్పినీడి బాబ్జి, కాసా సత్యనారాయణ పాల్గొన్నారు.



కొవ్వలి నాయుడు కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

103 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రతి ఒక్కరికీ చూపు ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని క్లబ్ జోన్ పర్సన్ ఎస్‌వి.రంగారావు అన్నారు. మొగల్తూరులోని శ్రీనివాస హాస్పిటల్ వద్ద లయన్స్ క్లబ్ మొగల్తూరు ఆధ్వర్యంలో పాలకొల్లుకు చెందిన రాజ వల్లి రాధా రామణ్ లయన్స్ కంటి ఆసుపత్రి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రంగారావు ప్రారంభించి మాట్లాడారు. మొగల్తూరు క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన సభ్యులకు సూచించారు. ఈ శిబిరంలో 103 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో 42 మందికి శాస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించామని క్లబ్ సభ్యులు తెలిపారు. వారికి పాలకొల్లులోని నేత్ర వైద్య శిబిరంలో శాస్త్రవేత్తలు నిర్వహిస్తామని అన్నారు. ఈ శిబిరంలో పి.గోపాలకృష్ణ, దొంగ నిర్మల, పావని, లక్ష్మీపతి రాజు తదితరులు సేవలందించారు. ఈ కార్యక్రమంలో మొగల్తూరు అధ్యక్షులు రాంబాబు, కార్యదర్శి తణుకుల రామకృష్ణ, కోశాధికారి డాక్టర్ చెరుకూరి శ్రీనివాసరాజు, గుబ్బల నాగరాజు, పాల రాంబాబు పాల్గొన్నారు.

ఒప్పంద జిఒను అమలు చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆశా వర్కర్ల సమస్యలపై గతంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఒప్పందం కుదుర్చుకున్న జిఒను వెంటనే ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం అందించే పనిభారం తగ్గించాలన్నారు. పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శ్మశానంలో చెత్తను తొలగించాలని నిరసన

ప్రజాశక్తి - ఉండి

ఉండి శివారు ఉప్పుగుంట వెళ్లే రహదారిలోని హిందూ శ్మశానవాటికలో వేసిన చెత్తను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని సిపిఎం జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిపిఎం నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశాన వాటికకు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న చెత్తను తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి మృతుని బంధువులు చెప్పినప్పటికీ నిర్లక్ష్యం వహించడం దుర్మార్గమని విమర్శించారు. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించడానికి శ్మశానవాటికకు వెళ్లేందుకు దారి లేక నడిరోడ్డు పైనే నిర్వహించడంతో సమీప గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారని, ఇవిపునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం తహశీల్దార్ కె.నాగార్జున మాట్లాడుతూ శ్మశానవాటికకు ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డును వేరే చోటికి మార్చేందుకు శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొట్టాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము, కాల్వ ఏసు ఉన్నారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

వివేకానంద గ్లోబల్ విద్యార్థుల ప్రతిభ

తణుకు: వివేకానంద గ్లోబల్ స్కూల్ విద్యార్థులు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నిర్వహించిన రాష్ట్రస్థాయి స్మార్ట్ ఆంధ్ర హ్యాక్‌థాన్ కార్యక్రమంలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.రవీంద్రనాధ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద గ్లోబల్ స్కూల్ విద్యార్థులు జూనియర్ కేటగిరిలో పి.చేతన్, పి.దిలీప్, ఆర్.కౌశిక్, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రథమ బహుమతి కింద రూ.10 వేల నగదును గెలుపొందారని, దీక్షిత బృందానికి, నందిని బృందానికి, మేఘన బృందానికి కన్సలేషన్ బహుమతులు కింద వెయ్యి రూపాయలు నగదు బహుమతిని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనాసాయి విద్యార్థులను అభినందించారు.

రీసర్వేతో ఎన్నో ఉపయోగాలు : తహశీల్దార్

పాలకోడేరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న రీ సర్వేతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని పాలకోడేరు తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి అన్నారు. శృంగవృక్షం గ్రామంలో రీసర్వేపై మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రైతులు, భూస్వాములు ప్రతి ఒక్కరూ రీ సర్వేకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జంగం సూరిబాబు, టిడిపి ముఖ్య నేత కలిదిండి కృష్ణంరాజు (బుజ్జి) రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణ రాజు, ఆర్ఐ రాఘవ మూర్తిరాజు, సొసైటీ మాజీ అధ్యక్షులు పేరిచర్ల కనకరాజు, నడింపల్లి రామకృష్ణంరాజు (బ్యాంకు బుజ్జి), మండల సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మెరుగైన జీవనోపాధికి కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని వివిధ వర్గాల మహిళల మెరుగైన జీవనోపాధికి వినూత్న ప్రాజెక్టుల అమలుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి గ్రామీణ్ ఫౌండేషన్ ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి జిల్లాలో మహిళల ఉపాధికి అవసరమైన ప్రాజెక్టులపై గ్రామీణ్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలోని విభిన్న వర్గాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వినూత్న ప్రాజెక్టులను అమలు చేయడంతో పాటు, అవసరమైన శిక్షణను అందించాలని సూచించారు. జిల్లాలో వర్మీ కంపోస్ట్ ఎగుమతులకు అవసరమైన సహాయాన్ని అందించడం, డ్రోన్లు ఎగరవేయడానికి అవసరమైన శిక్షణ, డ్రోన్‌లను సమకూర్చడం, డిజిటల్ ఫైనాన్స్ అవకాశాన్ని పెంచడం తదితర ప్రాజెక్టుల రూపకల్పనకు ఆలోచన చేసి అమలుకు సిద్ధం చేయాలన్నారు. గ్రామీణ ఫౌండేషన్ సీనియర్ ప్రోగ్రాం డైరెక్టర్ అరిందం దాస్ గుప్తా మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ, కృష్ణ, విశాఖపట్నం జిల్లాల్లో సిఎస్ఆర్ ఫండ్స్‌తో గ్రో ప్రాజెక్టును చేపట్టడం జరిగిందన్నారు. మూడు నెలల్లో 5 వేల మంది మహిళా రైతులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్ది, మరో 10 లక్షల మంది చిన్న, సన్న కారు రైతులకు సహాయం చేసేలా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. తొలుత పశ్చిమగోదావరిలోని యానాది, ఎరుకల జీవనోపాధి మెరుగుదల కోసం ముసాయిదా ప్రతిపాదనను గ్రామీణ బందం తయారు చేసి జిల్లా కలెక్టర్ కు వివరించడం జరిగింది. ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. సమావేశంలో రీజినల్ డైరెక్టర్ సక్యూబ్ ఖాన్, నాలెడ్జ్ ఆఫీసర్ ఎస్.డేవిడ్ బ్రైనర్డ్, ఎస్‌పిఎం ఎం.ఆనంద్ నాయక్, ఎస్‌డి ఆసియా, డిఆర్‌డి కుసుమ కుమారి పాల్గొన్నారు.

ఎస్‌సి కులగణనపై 12వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ

ఎస్‌సి కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల స్వీకరణ గడువును ఈ నెల 12వ తేదీ వరకూ పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. ఈ నెల ఏడుతో గడువు పూర్తవ్వడంతో మరో 5 రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేయడం జరిగిందన్నారు. కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా 16వ తేదీ వరకూ అధికారులు నమోదు చేస్తారని తెలిపారు.

కాలుష్య నియంత్రణ మార్గాలు ఆలోచించి అమలు చేయాలి

జల, వాయు, భూ కాలుష్య నియంత్రణ మార్గాలను ఆలోచించి అమలు చేయడంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నాగరాణి జిల్లాలో వివిధ మార్గాల ద్వారా పొగవుతున్న చెత్తను నియంత్రించేందుకు మున్సిపల్, ఇరిగేషన్, డ్వామా, ఫిషరీస్, డిఆర్‌డిఎ, టూరిజం శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో తణుకు మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ భాస్కర్, ఇరిగేషన్ ఎఇ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ ఎఫ్‌డిఒ వివేక్, జిల్లా టూరిజం అధికారి అప్పారావు, డిఆర్‌డిఎ కుసుమ కుమారి పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితం

సూపర్ లగ్జరీ బస్సులను ప్రారంభించిన ఎంఎల్‌ఎలు

తాడేపల్లిగూడెం: ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం నుంచి విశాఖపట్నం వెళ్లే సూపర్‌లగ్జరీ బస్సును ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌టిసి నష్టాల్లో ఉండడానికి కారణం గత వైసిపి ప్రభుత్వంలో రోడ్లు సక్రమంగా లేక బస్సులు తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు ఆర్‌టిసి సర్వీసును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌టిసికి ఉన్న ఆర్గనైజేషన్ ప్రపంచంలోనే ఎక్కడా లేదన్నారు. ఐదేళ్లుగా వైసిపి దొంగలతో లూటీ చేసి మొత్తం రాష్ట్రాన్నే దోచుకుపోయిందన్నారు. జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దాదాపు 1600 బస్సుల ప్రారంభించడం జరుగుతుందని, 900లకు పైగా బస్సులు ప్రారంభించామన్నారు. తాడేపల్లిగూడెంలో గతంలో నాలుగు, ప్రస్తుతం ఒక బస్సుతో కలిపి మొత్తం ఐదు బస్సులు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. డిపో మేనేజర్ మూర్తి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నుంచి నాలుగు సూపర్ లగ్జరీ బస్సులు రావడం విజయవాడ, హైదరాబాద్ మీదుగా వెళ్లే సర్వీసులు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కృషితో కొత్తగా భీమవరం రూట్‌లోకి మూడు బస్సులు ప్రవేశపెట్టడం, అదేవిధంగా రావులపాలెం ఏలూరు రూట్‌లో కూడా రెండు బస్సులు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సుధారాణి, ఎన్ఎంయుఎ ప్రెసిడెంట్ ఎంఎస్.బాబు, ఎన్ఎంయుఎ సెక్రటరీ ఎ.రవికుమార్, ఇవి ప్రెసిడెంట్ చోడగిరి పాల్గొన్నారు.



సూపర్ లగ్జరీ బస్సును ప్రారంభించిన ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్, విజయవాడ బోర్డు జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు

భీమవరం టౌన్ : ఆర్‌టిసి ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తున్నామని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం కొత్త బస్టాండ్ నుంచి బత్తిలికి సుమారు రూ.60 లక్షలతో కొత్త బస్‌ను ఎమ్మెల్యే అంజిబాబు మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు ఆర్‌టిసి సేవలను వినియోగించుకోవాలన్నారు. డిపో మేనేజర్ పిఎన్.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఇటీవల కాలంలోనే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 3 బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

బేతపూడి జెడ్‌పి హైస్కూల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని, విద్యార్థి దశలో బాగా చదువుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హితవు పలికారు. మంగళవారం భీమవరం మండలం బేతపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జెసి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే మంచి విద్యను అభ్యసించాలన్నారు. ప్రతి విద్యార్థీ గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని జెసి విద్యార్థులతో కలిసి చేశారు. విద్యార్థులకు తయారు చేసిన వంటలు రుచికరంగా ఉండాలన్నారు. వంటకాలను ప్రతిరోజూ పరిశీలించాలని ప్రధానోపాధ్యాయులను జెసి సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ రావి రాంబాబు, మండల సర్వేర్ జి.నాగబాబు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎండోమెంట్స్ అధికారులు ఉన్నారు.

నేడు ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వహణ అధికారి మోకా అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేవారు ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉండాలని ఆయన సూచించారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇఇ మధుకుమార్, సిబ్బంది

విద్యుత్ ఛార్జీల ప్రతిపాదనపై అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - నరసాపురం

2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల (టారిఫ్) ప్రతిపాదనలపై మంగళవారం ఎపిఇఆర్‌సి ఆధ్వర్యంలో ప్రజల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నరసాపురం ఇఇ కార్యాలయంలో ఇఇ కె.మధుకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలు మాట్లాడేందుకు వీలుగా స్క్రీన్ ఏర్పాటు చేసి ఆయన పాల్గొన్నారు. డిజిటల్ స్క్రీన్ ద్వారా ఈ నెల 8, 10 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఛార్జీల పెంపుపై తమ అభిప్రాయాలను నేరుగా ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్‌రామ్ సింగ్ తెలిపవచ్చన్నారు.

స్త్రీనిధి రుణాల వసూళ్లలో జిల్లా ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - మొగల్తూరు

స్త్రీనిధి రుణాల వసూళ్లలో జిల్లా రెండో స్థానంలో ఉందని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కృష్ణమనాయుడు తెలిపారు. మంగళవారం మొగల్తూరులోని మహిళ సమాఖ్య కార్యాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంఘాల అభ్యున్నతికి 2002లో బ్యాంక్ లింకేజ్ రుణాలు, ఎస్‌సి, ఎస్‌టి నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. 2012లో ఆన్‌లైన్ విధానంలో రుణాల కోసం దరఖాస్తు చేసుకోవడం, రుణాలివ్వడం ప్రారంభించడం జరిగిందన్నారు. 'సుమారు రూ.150 కోట్ల రుణాలందించడం, వసూలు చేయడం ద్వారా రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో మేనేజర్ చిట్టిబాబు, ఎపిఎం ప్రభుదాస్, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్, మూర్తిస్ జనరల్ స్టోర్స్, నరేష్ టెక్నాలజీ ఆధ్వర్యంలో స్థానిక ఎంఎంకెఎన్ హైస్కూల్ వద్ద 10వ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సంఘం అధ్యక్షులు జక్కంపూడి మదన్ కోరారు. సంఘం కార్యదర్శి వేరుకొండ దుర్గాప్రసాద్, కటారి నాగు, నిమ్మల భాను, హెడ్మాష్టర్ అద్దాల నాని, యుటిఎఫ్ ట్రెజరర్ మద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.